



TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక

## రణ్‌వీర్‌పై 'నిషేధం' ఎత్తివేత.. 'ఎఫ్‌డబ్ల్యూఐసీఈ' అధికారిక ప్రకటన



04

హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 24 | 04-06-2026 గురువారం | పేజీలు: 04 | వెల: 3/-

# గేమ్ యాప్స్ నిషేధంపై రాష్ట్రాలకే అధికారం

సుప్రీంకోర్టు కీలకమైన తీర్పు
డబ్బులు పెట్టి గేమ్స్ ఆడితే రాజ్యాంగం రక్షణ కల్పించాలా?
ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై రాష్ట్రాలకు పూర్తి నియంత్రణ హక్కు
రమ్మీ, పోకర్ వంటి గేమ్స్‌లో డబ్బుల పందేలు జూదమే
బెట్టింగ్ వ్యాపారం మౌలిక హక్కు కాదన్న సుప్రీంకోర్టు
తమిళనాడు, కర్ణాటక చట్టాలకు అత్యున్నత న్యాయస్థానం మద్దతు
యువతను వ్యసనాల నుంచి కాపాడేందుకు నిషేధాలు సమర్థనీయం
సామాజిక ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్రాల చర్యలు చెల్లుబాటు
నైపుణ్య ఆటల పేరుతో బెట్టింగ్‌కు అనుమతి లేదని స్పష్టీకరణ
గేమింగ్ కంపెనీల వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం
దేశవ్యాప్తంగా బెట్టింగ్ యాప్‌లపై కఠిన చర్యలకు మార్గం
ఆన్‌లైన్ జూద నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వాలకు బలమైన అండ



**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**

ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ రంగంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ తదితర గేమ్స్‌లో డబ్బులు పందెంగా పెట్టి ఆడి రాజ్యాంగ పరిరక్షణ పొందలేరని ధర్మాసనం స్పష్టంచేసింది. ఇలాంటి కార్యకలాపాలను నిషేధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తిగా ఉంటుందని తేల్చిచెప్పింది.

జస్టిస్ జేబీ పార్ధీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్ కార్యకలాపాలను నియంత్రించేందుకు రూపొందించిన ...మిగతా 2లో

# దక్షిణాఫ్రికా పెట్టుబడులకు గేట్లు తెరిచాం

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన



ఆ దేశ ఉపాధ్యక్షుడు పాలస్ మషటైల్‌తో భేటీ
ఎంసీహెచ్‌ఆర్డీలో దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందంతో సీఎం సమావేశం
పెట్టుబడులకు తెలంగాణ అత్యంత అనుకూల రాష్ట్రంగా రేవంత్ వ్యాఖ్యలు
విదేశీ పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం
వాణిజ్య, పారిశ్రామిక సంబంధాల బలోపేతంపై చర్చలు
ఐటీ, ఫార్మా, మౌలిక సదుపాయాల రంగాల్లో సహకార అవకాశాల పరిశీలన
దక్షిణాఫ్రికా కంపెనీలకు పూర్తి సహకారం అందిస్తామన్న సీఎం
పారదర్శక పాలన, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ తెలంగాణ ప్రత్యేకత
పరిశ్రమల స్థాపనతో ఇరు ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి ఊతం
తెలంగాణ పారిశ్రామిక ప్రగతిపై ఆసక్తి వ్యక్తం చేసిన పాలస్ మషటైల్
భవిష్యత్తులో పెట్టుబడి, వాణిజ్య రంగాల్లో సహకారం పెంపునకు అంగీకారం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక విధానాలు అమలు చేస్తున్నామని, పెట్టుబడిదారులకు అత్యంత అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. అధికారిక పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు Paul Mashatile నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం ఎంసీహెచ్‌ఆర్డీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసింది.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, పారిశ్రామిక, పెట్టుబడి సంబంధాలను మరింత విస్తరించే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా సమాచార సాంకేతికత, తయారీ రంగం, మౌలిక సదుపాయాలు, ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయం తదితర రంగాల్లో పరస్పర సహకార అవకాశాలను పరిశీలించారు. ఇరు ప్రాంతాల మధ్య ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడం ద్వారా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు ...మిగతా 2లో

## తెలంగాణను సుసంపన్న రాష్ట్రంగా తీర్చిదిద్దాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
కాంగ్రెస్ పాలనతో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడింది
కేసీఆర్ పోరాట ఫలితమే తెలంగాణ ఆవిర్భావమని స్పష్టం
పెట్టుబడుల ఆకర్షణలో బెంగళూరును అధిగమించామని వ్యాఖ్య
సాగుభూమి విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచామని వెల్లడింపు
24 గంటల ఉచిత విద్యుత్‌తో వ్యవసాయ రంగానికి బలం చేకూర్చామన్న కేటీఆర్
రైతుబంధు వంటి పథకాలతో రైతులకు భరోసా కల్పించామని వ్యాఖ్య
తలసరి ఆదాయంలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపామన్న బీఆర్ఎస్ నేత
తెలంగాణ వ్యతిరేక భావజాలం ఉన్నవారే ఇప్పుడు అధికారంలో ఉన్నారని విమర్శ
ప్రాంతీయవాదంపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను తప్పుబట్టిన కేటీఆర్
తెలంగాణ ఉద్యమాన్ని అవమానించే ప్రయత్నాలను ప్రజలు సహించరని హెచ్చరిక



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో ప్రారంభమైన అభివృద్ధి ప్రయాణం పదేళ్లలో రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలిపిందని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర అభివృద్ధి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై విస్తృతంగా స్పందించారు.తెలంగాణ రాష్ట్రం ...మిగతా 2లో

## మీ కమ్యూనిజం ఏమైంది?

పవన్ వ్యాఖ్యలపై సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు విమర్శలు
జనసేన కనుమరుగైనా కమ్యూనిజం నిలిచి ఉంటుందని వ్యాఖ్య
పవన్ కల్యాణ్ అపరిచితుడిలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పవన్ కల్యాణ్ నిన్న చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. తన తండ్రి, ...మిగతా 2లో

## నీ సీటు కూడా గెలిచి తీరుతాం..

కూనంనేని సవాల్ స్వీకరిస్తున్నాం
ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్, రేవంత్‌కు అవే చివరి ఎన్నికలని వ్యాఖ్య
స్వంత పార్టీని కాపాడుకోలేక బీఆర్ఎస్ నేతలు బీజేపీని టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు.
బీజేపీని బద్నాం చేసే ప్రయత్నాలు బాధాకరమని అన్నారు.
'జై తెలంగాణ' పేరుతో ఇతర పార్టీలను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు.
తెలంగాణ భూమి పుత్రులు అంటే ఎవరో చెప్పాలని ప్రశ్నించారు.
బీఆర్ఎస్ గతంలో ఆంధ్ర ప్రజలపై చేసిన వ్యాఖ్యలను ప్రజలు మర్చిపోలేదన్నారు.




**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఎపుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్‌కు, రేవంత్‌కు అవే చివరి ఎన్నికలు అని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. తెలంగాణలో బీజేపీ ఎదుగుదలకు అడ్డుకట్ట వేసేందుకు ...మిగతా 2లో

## తెలంగాణలో భూములకు కొత్త ధరలు.. జూన్ 5 నుంచే ప్రారంభం..

భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల మార్కెట్ విలువ సవరణ
పెరగనున్న స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు
శాస్త్రీయ పద్ధతిలో విలువలు సవరించినట్టు తెలిపిన మంత్రి పొంగులేటి
వాస్తవ ధరలకు అనుగుణంగా మార్పులు చేసినట్టు వెల్లడి



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో కీలక మార్పు చోటుచేసుకోబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా సవరించిన భూముల మార్కెట్ ...మిగతా 2లో

# ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం



**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**

దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం ఉదయం ఘోర అగ్నిప్రమాదం సంభవించి భారీ ప్రాణనష్టం చోటుచేసుకుంది. దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్ ప్రాంతంలో ఉన్న లెమన్ గ్రీన్ రెస్టారెంట్ భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కనీసం 21 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ధృవీకరించారు. మరో నలభై మందికి పైగా గాయపడగా, వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో విదేశీయులు కూడా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం వెలువడింది.

ఉదయం సమయంలో రెస్టారెంట్‌లో భారీగా పొగలు వ్యాపించడంతో భవనంలో ఉన్నవారు బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు పై అంతస్తుల నుంచి దూకినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్థానికులు వెంటనే ...మిగతా 2లో

మాలవీయ నగర్ రెస్టారెంట్‌లో మంటలు.. 21 మంది మృతి
విదేశీయులు సహా పలువురు దుర్మరణం ..
ఢిల్లీలోని లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో భారీ అగ్నిప్రమాదం
మంటల్లో చిక్కుకుని 21 మంది మృతి చెందినట్లు అధికారుల ధృవీకరణ
40 మందికి పైగా గాయాలు.. ఆసుపత్రుల్లో చికిత్స
మృతుల్లో విదేశీయులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం
పది ఫైరింజన్లతో సహాయక చర్యలు కొనసాగింపు
భవనంలో మరికొందరు చిక్కుకుపోయి ఉండొచ్చని అంచనా
రెస్టారెంట్ బేస్‌మెంట్ నుంచి మంటలు వ్యాపించినట్లు సమాచారం
షార్ట్ సర్క్యూట్ కోణంలో దర్యాప్తు
ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి
మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

# మీ కమ్యూనిజం ఏమైంది?

**మొదటిపేజీ తరువాయి**

తాను కమ్యూనిస్టులమని పవన్ కల్యాణ్ పదేపదే చెబుతారని, మరి మీలోని ఆ కమ్యూనిజం ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు.
సనాతన ధర్మం, కమ్యూనిజం, రాష్ట్ర విభజన వంటి అంశాలపై పవన్‌ను ఆయన నిలదీశారు. జనసేన పార్టీ కనుమరుగైనా, కమ్యూనిజం నిలిచి ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాల్లోకి దూకుడుగా ప్రవేశించడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆయన అపరిచితుడిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రపంచ కార్మికులారా విడిపోండని కమ్యూనిస్టులు చెప్పారా అని ప్రశ్నించారు. ఈ విషయంలోకి కమ్యూనిస్టులను ఎందుకు లాగారని ప్రశ్నించారు.
పవన్ కల్యాణ్ ఆవిర్భావ దినోత్సవాన్ని



రాజకీయం చేస్తున్నారని, రాజకీయ లబ్ధి కోసమే ప్రాంతీయ వాదాన్ని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజే వచ్చి సవాల్ విసరడమంటే ప్రాంతీయవాదాన్ని రెచ్చగొట్టడమే అన్నారు.

# నీ సీటు కూడా గెలిచి తీరుతాం..

**మొదటిపేజీ తరువాయి**

కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు కుతంత్రాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన.. స్వంత పార్టీని కాపాడుకోలేక, బీఆర్ఎస్ నేతలు బీజేపీని టార్గెట్ చేస్తున్నారని, చిట్‌చాట్‌ల పేరుతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బీజేపీని బద్నాం చేసేందుకు మాట్లాడుతున్న మాటలు బాధాకరం అన్నారు. జై తెలంగాణ నినాదంతో ఇతర పార్టీలను టార్గెట్ చేస్తున్నారని తెలంగాణ భూమి పుత్రులు అంటే ఎవరు? అని ప్రశ్నించారు. ఆంధ్ర ప్రజల విషయంలో బీఆర్ఎస్ ఎన్ని మాటలు చెప్పలేదు? మార్చ లేదు? దోచుకుంటున్నారనే బీఆర్ఎస్‌ను జనం ఇంటికి పంపించారన్నారు.

**కూనంనేని సవాల్ స్వీకరిస్తున్నాం:**
ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీజేపీ ఒక్క సీటు గెలిచినా తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఆ పార్టీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన చాలెంజ్‌పై రఘునందన్ రావు స్పందించారు. తెలంగాణలో ఎవరితో పొత్తు పెట్టుకోకుండా సీపీఐ పోటీ చేసి గెలుస్తుందా? పొత్తు లేకుండా కమ్యూనిస్టులు గెలుస్తారా అని ప్రశ్నించారు. కమ్యూనిస్టులను ప్రజలు ఎప్పుడో లెఫ్ట్ చేశారని స్వంతంగా నిలబడే పరిస్తితి ఆపార్టీలకు లేదన్నారు. కూనంనేని సవాలును స్వీకరిస్తున్నామని ఖమ్మంలో రానున్న ఎన్నికల్లో గెలుస్తామన్నారు. కూనంనేని సీటును సైతం తామే గెల్చుకోబోతున్నామన్నారు. మా బలం మా కార్యకర్తలు.. అంత్యోదయ మా సిద్ధాంతం అన్నారు.

**కాంగ్రెస్ తప్పులకు చర్యలు తప్పవు:**
అన్ని రాష్ట్రాలను సమ దృష్టితో చూసిన వ్యక్తి ప్రధాని నరేంద్ర మోడీ అని రఘునందన్ రావు అన్నారు. కాంగ్రెస్ తూర్పు అయితే బీజేపీ పడమర అని బీజేపీ పోరాటం కాంగ్రెస్ ముక్త భారత్ అన్నారు. కాంగ్రెస్ అవినీతికి వ్యతిరేకంగా మేం పోరాడుతున్నామని, కాంగ్రెస్ చేసిన తప్పులకు ప్రజా క్షేత్రంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. వెస్ట్ బెంగాల్‌లో బీజేపీ గెలిచిందంటే, తెలంగాణలో బీజేపీ గెలుపును ఎవ్వరూ ఆపలేరన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ప్రతి బూత్‌ను ఒంటరిగా గెలిగేందుకు ప్రయత్నం చేస్తామన్నారు.




# ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో పది ఫైరింజన్లు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి.
అగ్నిప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో భవనం అంతటా మంటలు వేగంగా వ్యాపించాయి. రెస్టారెంట్ బేస్‌మెంట్‌లో చిక్కుకున్న పలువురిని అగ్నిమాపక సిబ్బంది బయటకు తీసుకువచ్చినప్పటికీ, అప్పటికే భారీ ప్రాణనష్టం జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కూడా భవనంలో మరికొందరు చిక్కుకుపోయి ఉండొచ్చనే అనుమానంతో రెస్క్యూ బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.
అధికారుల సమాచారం ప్రకారం, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. ప్రమాద సమయంలో భవనంలో ఉన్నవారిలో విదేశీయులు కూడా ఉండటంతో వారి గుర్తింపుపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు.
ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా వెల్లడికాలేదు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయా లేదా ఇతర కారణాలున్నాయా అనే కోణంలో పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. భవనంలో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు.



ఈ విషాద ఘటనపై ప్రధాని నరేంద్రమోడీ స్పందించారు. అగ్నిప్రమాదంలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు అన్ని విధాలా సహాయం అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ప్రస్తుతం అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు సంయుక్తంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది.

# దక్షిణాఫ్రికా పెట్టుబడులకు గేట్లు తెరిచాం

**మొదటిపేజీ తరువాయి**

పెరిగే అవకాశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు.
సమావేశంలో మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని స్పష్టం చేశారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, పారదర్శక పాలన, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ, ఆధునిక మౌలిక వసతులు తెలంగాణ ప్రత్యేకతలని వివరించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో దక్షిణాఫ్రికా కంపెనీలు పెట్టుబడులు పెట్టడం ద్వారా ఇరు ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని సీఎం అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఐటీ, ఔషధ తయారీ, ఆహార ప్రాసెసింగ్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, లాజిస్టిక్స్ రంగాల్లో భాగస్వామ్యానికి విశాల అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.
దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాలస్ మషటైల్ తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక రంగంలో సాధిస్తున్న పురోగతిపై ఆసక్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న పెట్టుబడి అనుకూల వాతావరణం, వేగంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల రంగాన్ని ప్రశంసించారు. భవిష్యత్తులో తెలంగాణతో మరింత సన్నిహిత ఆర్థిక, వాణిజ్య సంబంధాలను కొనసాగించేందుకు తమ దేశం ఆసక్తిగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ తరపున మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి దామోదర రాజనరసింహ, సీఎస్ రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఇరు పక్షాలు పెట్టుబడులు, వాణిజ్యం, పారిశ్రామిక సహకారం రంగాల్లో భవిష్యత్తులో మరింత సమ



న్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

# తెలంగాణను సుసంపన్న రాష్ట్రంగా తీర్చిదిద్దాం

**మొదటిపేజీ తరువాయి**

ఏర్పడటానికి ప్రధాన కారణం కేసీఆర్ నాయకత్వంలో సాగిన ఉద్యమమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అధికారికంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఆ నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితిని సృష్టించిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. తెలంగాణ కోసం జరిగిన పోరాటం ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచిందని చెప్పారు.
రాష్ట్రం ఏర్పడిన సమయంలో తెలంగాణపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయని, కొత్త రాష్ట్రాన్ని సమర్థవంతంగా నడిపించగల నాయకత్వం ఉందా అనే ప్రశ్నలు కూడా ఎదురయ్యాయని గుర్తుచేశారు. అయితే పదేళ్ల పాలనలో ఆ అనుమానాలన్నింటికీ సమాధానం ఇచ్చామని, తెలంగాణను దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన రాష్ట్రంగా తీర్చిదిద్దామని అన్నారు.
వ్యవసాయ రంగంలో సాధించిన పురోగతిని వివరిస్తూ 2014లో రాష్ట్రంలో సాగుభూమి విస్తీర్ణం సుమారు 1.50 కోట్ల ఎకరాలు మాత్రమే ఉండేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న చివరి ఏడాది నాటికి అది 2.29 కోట్ల ఎకరాలకు పెరిగిందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్ సరఫరా, రైతు సంక్షేమ కార్యక్రమాల వల్లే ఈ మార్పు సాధ్యమైందన్నారు.
వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించిన రాష్ట్రంగా తెలంగాణ ప్రత్యేక గుర్తింపు పొందిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల హామీల్లో లేకపోయినా రైతుల పెట్టుబడి భారాన్ని తగ్గించేందుకు రైతుబంధు పథకాన్ని అమలు చేశామని చెప్పారు. రైతు సంక్షేమాన్ని కేంద్రంగా పెట్టుకుని అమలు చేసిన విధానాల ఫలితంగానే తెలంగాణ దేశానికి అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందని వ్యాఖ్యానించారు.
ఆర్థికాభివృద్ధి రంగంలోనూ రాష్ట్రం విశేష పురోగతి సాధించిందని కేటీఆర్ అన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ దేశంలోని ప్రధాన నగరాలతో పోటీ పడటమే కాకుండా కొన్ని రంగాల్లో ముందంజలో నిలిచిందని చెప్పారు. తలసరి ఆదాయంలో రాష్ట్రాన్ని అగ్రస్థానానికి చేర్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. తాను చెప్పిన అభివృద్ధి గణాంకాలు తప్పని ఎవరైనా నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు.
ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి పాలన సాగించామని కేటీఆర్ తెలిపారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేశామని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ భావజాలానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వ్యక్తులు అధికార పదవుల్లో ఉండటం బాధాకరమని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులపై కఠిన చర్యలకు పాల్పడిన వ్యక్తులు ఇప్పుడు కీలక స్థానాల్లో ఉండటం విచారకరమని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన కేటీఆర్, అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం వెనుకబడిందని, ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి వేగం తగ్గిపోయిందని కూడా విమర్శించారు.
జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన ప్రాంతీయవాదంపై వ్యాఖ్యలపై స్పందించిన కేటీఆర్, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వెనుక ఉన్న చారిత్రక నేపథ్యాన్ని గుర్తుచేశారు. ప్రాంతీయ ఆకాంక్షలు, స్వీయ పరిపాలన కోసం జరిగిన ఉద్యమాలను ఉగ్రవాదంతో పోల్చడం సరైన వ్యాఖ్య కాదన్నారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల త్యాగాలను కూడా అలాంటి వ్యాఖ్యలు అవమానపరుస్తాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమం ప్రజాస్వామ్య పద్ధతుల్లో సాగిందని, లక్షలాది మంది ప్రజల ఆకాంక్షల ఫలితంగానే రాష్ట్రం ఏర్పడిందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భావజాలాన్ని, ఉద్యమ చరిత్రను తక్కువ చేసి చూపే ప్రయత్నాలను ప్రజలు సహించరని హెచ్చరించారు. జాతీయవాదం, ప్రాంతీయ స్వాభిమానాన్ని పరస్పర విరుద్ధాలుగా చూడాల్సిన అవసరం లేదని, తెలంగాణ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# తెలంగాణలో భూములకు కొత్త ధరలు.. జూన్ 5 నుంచే ప్రారంభం..

**మొదటిపేజీ తరువాయి**

విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార అండ్ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారికంగా ప్రకటించారు. క్షేత్రస్థాయిలో వాస్తవ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ విలువలకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసాలను తొలగించి, అత్యంత శాస్త్రీయంగా, హేతుబద్ధంగా ఈ కొత్త ధరలను నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ప్రముఖ ఆర్థిక నిపుణుడు అరవింద్ సుబ్రమణ్యం ఇచ్చిన నివేదికను, ఉన్నతాధికారుల సలహాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 202122లో ఎలాంటి క్షేత్రస్థాయి అధ్యయనం లేకుండా కేవలం ఆరు నెలల వ్యవధిలోనే రెండుసార్లు అశాస్త్రీయంగా ధరలను పెంచిందని, దీనివల్ల కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ రేటు కంటే ప్రభుత్వ విలువలు భారీగా పెరిగాయని మంత్రి విమర్శించారు. ఈ అసమానతలను సరిదిద్దేందుకు రాష్ట్రంలోని మొత్తం 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువల సవరణ చేపట్టారు.
కొత్త విలువల నిర్ణయంలో పారిశ్రామికాభివృద్ధి, కొత్త రహదారులు, ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకున్నారు. ఇప్పటికే అధిక రేట్లు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి పెంపుదల చేయలేదు. అలాగే, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లలో అంతస్తుల వారీగా ఉన్న అసమానతలను తొలగించి అన్ని అంతస్తులకు ఒకే రేటు వర్తింపజేశారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ పరిధిలోని వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కనీస ప్రాథమిక రేట్లను కూడా ఖరారు చేశారు.
మరోవైపు.. గత ఐదేళ్లలో నిర్మాణ సామగ్రి ధరలు, కార్మికుల వేతనాలు పెరిగిన నేపథ్యంలో 2021 తర్వాత మొదటిసారిగా నిర్మాణ వ్యయాల రేట్లను కూడా సవరించారు. అనేక పంచాయతీలు మున్సిపాలిటీలుగా మారిన నేపథ్యంలో ఆర్‌సీసీ, నాన్‌ఆర్‌సీసీ నిర్మాణాల రేట్లను గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు అనుగుణంగా మార్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, భూ లావాదేవీలలో పారదర్శకతను పెంచుతూ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

# గేమ్ యాప్స్ నిషేధంపై రాష్ట్రాలకే అధికారం

**మొదటిపేజీ తరువాయి**

చట్టాలను సవాల్ చేస్తూ పలు గేమింగ్ కంపెనీలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరినే సమర్థించింది.

**రాష్ట్రాలకే పూర్తి అధికారం**
భారత రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్ ప్రకారం జూదం, బెట్టింగ్ అంశాలు రాష్ట్రాల పరిధిలోకి వస్తాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అందువల్ల ప్రజా ప్రయోజనాలు, శాంతిభద్రతలు, సామాజిక సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వాలు ఆన్‌లైన్ జూదంపై నియంత్రణలు విధించవచ్చని పేర్కొంది. ఇలాంటి అంశాలపై చట్టాలు చేసే పూర్తి అధికారం రాష్ట్రాలకే ఉంటుందని ధర్మాసనం తేల్చిచెప్పింది.

**నైపుణ్య ఆటలైనా మినహాయింపు లేదు**
గేమింగ్ కంపెనీలు తమ వాదనల్లో రమ్మీ, పోకర్ వంటి ఆటలు పూర్తిగా నైపుణ్యంపై ఆధారపడినవని, అందువల్ల వాటిని జూదంగా పరిగణించరాదని పేర్కొన్నాయి. అయితే ఈ వాదనను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. ఒక ఆటలో నైపుణ్యం ఉన్నప్పటికీ, దానిపై డబ్బులు పందెంగా పెట్టిన క్షణం నుంచి అది జూదం స్వరూపాన్ని సంతరించుకుంటుందని స్పష్టం చేసింది.
నైపుణ్యం, అదృష్టం మధ్య ఉన్న తేడాను గుర్తించినప్పటికీ, డబ్బుతో కూడిన పందేలు సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతున్న నేపథ్యంలో రాష్ట్రాలు జోక్యం చేసుకోవడం సమంజసమేనని న్యాయస్థానం పేర్కొంది. ఆటను నిషేధించడం కాదు, దానిపై జరిగే ఆర్థిక పందేలను నియంత్రించడమే ప్రభుత్వాల ఉద్దేశమని వ్యాఖ్యానించింది.

**మౌలిక హక్కు కాదన్న కోర్టు**
గేమింగ్ సంస్థలు తమ వ్యాపారాన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(జి) కింద రక్షిత వ్యాపార కార్యకలాపంగా పరిగణించాలని కోరాయి. అయితే బెట్టింగ్, జూదం వంటి కార్యకలాపాలు సాధారణ వ్యాపారాల తరహాలో మౌలిక హక్కుల పరిధిలోకి రావని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బెట్టింగ్ నిర్వహించడం లేదా దాని ద్వారా లాభాలు ఆర్జించడం ఎవరికీ ప్రాథమిక హక్కు కాదని ధర్మాసనం పేర్కొంది. సమాజానికి హాని కలిగించే అవకాశమున్న కార్యకలాపాలపై ప్రభుత్వం పరిమితులు విధించవచ్చని స్పష్టం చేసింది.

**యువతపై ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకున్న కోర్టు**
ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల కారణంగా ఏర్పడుతున్న సామాజిక సమస్యలను కూడా సుప్రీంకోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. ముఖ్యంగా యువతలో వ్యసనాలు పెరగడం, కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో పడటం, అప్పుల భారం పెరగడం, మానసిక ఒత్తిడులు, ఆత్మహత్యలు వంటి ఘటనలు ఆందోళనకరంగా మారాయని పేర్కొంది. సాంకేతిక పరిజ్ఞానం విస్తరణతో మొబైల్ ఫోన్ల ద్వారానే లక్షలాది మంది ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొంటున్నారని, దీని ప్రభావం వ్యక్తిగత జీవితాలపై మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజంపైనా పడుతోందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం తీసుకునే నియంత్రణ చర్యలను తప్పుబట్టలేమని స్పష్టం చేసింది.

**హైకోర్టు తీర్పులపై స్పష్టత**
గతంలో తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు తీసుకొచ్చిన కొన్ని నిషేధ చట్టాలను ఆయా రాష్ట్రాల హైకోర్టులు కొట్టివేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే అనంతరం రాష్ట్రాలు చట్టాల్లో మార్పులు చేసి మళ్లీ కొత్త నిబంధనలను తీసుకురావడంతో వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. తాజా తీర్పులో రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన నియంత్రణ చర్యలు రాజ్యాంగబద్ధమైనవేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన చట్టాలను చెల్లుబాటు అయ్యేవిగా పేర్కొంది.

**దేశవ్యాప్తంగా ప్రభావం**
సుప్రీంకోర్టు తీర్పు ప్రభావం కేవలం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా కనిపించే అవకాశం ఉంది. ఇప్పటికే అనేక రాష్ట్రాలు ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల నియంత్రణపై ఆలోచిస్తున్నాయి. ఇప్పుడు సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడంతో ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కఠిన చట్టాలు తీసుకురావడానికి అవకాశం ఏర్పడింది. ప్రత్యేకించి క్రికెట్ బెట్టింగ్, ఫాంటసీ గేమింగ్ పేరుతో నడుస్తున్న డబ్బు ఆధారిత ప్లాట్‌ఫామ్‌లపై మరింత నిఘా పెరిగే అవకాశముందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**గేమింగ్ రంగంలో కొత్త చర్చ**
ఈ తీర్పు తర్వాత ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమలో కొత్త చర్చ మొదలైంది. నైపుణ్య ఆధారిత గేమ్స్, జూదం మధ్య స్పష్టమైన గీత ఎక్కడ గీయాలనే అంశంపై మరోసారి చర్చలు జరిగే అవకాశం ఉంది. అయితే డబ్బు పందేల అంశంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి అధికారం ఉందని సుప్రీంకోర్టు తేల్చి చెప్పడం ద్వారా భవిష్యత్ న్యాయపోరాటాలకు కూడా ఒక స్పష్టమైన దిశను నిర్దేశించింది. సమాజ ప్రయోజనాలు, యువత భవిష్యత్, ప్రజల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆన్‌లైన్ బెట్టింగ్‌పై నియంత్రణలు విధించడాన్ని సమర్థించిన సుప్రీంకోర్టు తీర్పు దేశంలో ఆన్‌లైన్ జూద నియంత్రణకు ఒక మైలురాయిగా నిలిచే అవకాశముంది. దీంతో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొనగా, రాష్ట్ర ప్రభుత్వాలకు మాత్రం చట్టపరమైన బలం లభించినట్లయింది.



# చెరువులో అనుమానాస్పద స్థితిలో వేలాది చేపలు మృతి

**నిజామాబాద్ పోతంగల్ జూన్ 03 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండల పరిధి లోని జల్లపల్లీ ఓల్డ్ విలేజ్ గ్రామంలోని ప్రధాన చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విష పదార్థాలు కలపడంతో వేలాది చేపలు మృత్యువాత పడ్డాయి. బుదవారం ఉదయం చెరువు నీటిపై చేపలు తేలడాన్ని గమనించిన స్థానిక మత్స్యకారులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందారు. చెరువులో ఎవరో గుర్తు తెలియని దుండగులు మందు (విషం) కలిపినట్లు మత్స్యకారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చేపల వేటపై కక్షతోనో లేదా ఆకతాయి చర్యగానో ఈ పని చేసి ఉంటారని భావిస్తున్నారు.జరిగిన నష్టం: సుమారు [15 నుండీ 20 లక్షల్లో] రూపాయల విలువైన చేపలు చనిపోయినట్లు అంచనా వేస్తున్నారు. ఇందులో పర్కలు బంగారుతిగ పాము చాపలు వివిధ రకాలైన పెద్ద చేపలు కూడా ఉండడంతో స్థానిక మత్స్యకారులకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది.పరిసర ప్రాంతాలపై ప్రభావం: చేపలు కుళ్లిపోతుండడంతో చెరువు పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వ్యాపించింది. తాగునీటి కోసం, ఇతర అవసరాలకు ఈ చెరువుపై ఆధారపడే స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక మత్స్యశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చెరువు నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. స్థానికులు ఇచ్చిన



ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. చెరువులో మందు కలిపిన దుండగుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర అధ్యక్షులు మేత్రి పెద్ద భూమన్న. సెక్రెటరీ శ్రీ గంధం పోశెట్టీ గంగపుత్ర సంఘం నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# దళిత,గిరిజన జర్నలిస్టుల రక్షణే మా సంకల్పం : కాదేపురం గంగన్న

- **అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**కోటగిరి, జూన్ 03(డిడి9 వార్త) :**

తెలంగాణ రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టుల రక్షణతో పాటు వారి అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీఎస్ఎస్‌డబ్ల్యూజేఏ) రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న పేర్కొన్నారు.

బుధవారం కోటగిరి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి కోటగిరి మండలానికి చెందిన దళిత జర్నలిస్టులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేసే జర్నలిస్టులకు న్యాయం జరగాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం చిన్న, పెద్ద పత్రికల మధ్య వివక్ష చూపకుండా ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు మంజూరు చేయాలని, హెల్త్ కార్డులు అందించడంతో పాటు జర్నలిస్టుల పిల్లలకు విద్యలో పూర్తి రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి జర్నలిస్టుకు ఇండ్ల స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.దళిత, గిరిజన జర్నలిస్టులపై దాడులు, వేధింపులు జరగకుండా ప్రత్యేక రక్షణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. త్వరలోనే నిజామాబాద్ జిల్లాలోని దళిత, గిరిజన జర్నలిస్టులను ఏకం చేసి జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో బేగరి రాములు, రాము, భీంరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# 35 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణానికి భూమిపూజ చేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- **పొచ్చర గ్రామంలో మట్టి రోడ్డు లేకుండా చేస్తా**

**ఆదిలాబాద్ జిల్లా ,బోథ్ జూన్ 03(డిడి9 వార్త) :**

బోథ్ మండలంలోని పొచ్చర గ్రామంలో రూ. 35 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణానికి బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్ష కాలం లోపే రోడ్లన్నీ పూర్తి చేయాలని సూచించారు. గ్రామంలో మట్టి రోడ్డు లేకుండా చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు స్వామి, స్థానిక సర్పంచ్ రాజు రెడ్డి, మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, రమణ రెడ్డి, రాజారెడ్డి, మధుమేహన్ రెడ్డి, దివాకర్ రెడ్డి, విష్ణు, రవీందర్ జాదవ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.




# రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టుల రక్షణే మా సంకల్పం

- **టీఎస్ఎస్ డబ్ల్యూజేఏ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న**

**నిజామాబాద్ కోటగిరి జూన్ 03 (డిడి9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి కోటగిరి మండలంలో గల దళిత జర్నలిస్టులతో కలిసి పాత్రికేయుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టుల రక్షణతో పాటు వారి అభివృద్ధి, సంక్షేమమే తమ సంకల్పమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న వెల్లడించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా పనిచేస్తూ, సమాజానికి మూల స్థంభమైన జర్నలిస్టులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్రిడిటేషన్ల విషయంలో న్యాయం చేయాలని అన్నారు. చిన్న పత్రికలు, పెద్ద పత్రికలు అనే తేడా చూపకుండా ఆయా పత్రికలలో పని చేసే ప్రతీ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ అందించాలిన్నారు. అదేవిదంగా హెల్త్ కార్డులు, వారి పిల్లల చదువులో పూర్తి శాతం రాయితీ కల్పించాలని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతీ జర్నలిస్టుకు ఇండ్ల స్థలాన్ని అందించి, ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజన జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రత్యేక రక్షణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. త్వరలోనే నిజామాబాద్ జిల్లాలో ఉన్న దళిత, గిరిజన జర్నలిస్టులను ఏకం చేసి నిజామాబాద్ జిల్లా ప్రథమ మహాసభను నిర్వహించనున్నట్లు అయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బేగరి రాములు, రాము, భీంరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ ఎంప్లాయి అవార్డు గ్రహీతకు ఆత్మీయ సన్మానం

**ఆదిలాబాద్ జిల్లా ,బోథ్ జూన్ 03(డిడి9 వార్త) :**

ఈరోజు ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కరెంటు విద్యుత్ శాఖ లో లైన్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న సబ్బని గోపి గారు వరంగల్ లో NPDCL CMD వరుణ్ రెడ్డి గారి చేతుల మీదుగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ కరెంటు సమస్యల పరిష్కారనికి చొరవచుపిన సందర్భంగా వారికి ఈరోజు బోథ్ మండల నాయకుల ఆధ్వర్యంలోశాలువాతో ఆత్మయ సన్మానం చేయడం జరిగింది ఈకార్యక్రమంలో న్యాయవాది పంద్రం శంకర్ సర్పంచ్ సంఘం అధ్యక్షులు స్వామి మాజీ అధ్యక్షులు బండారి శ్రీధర్ రెడ్డి బోథ్ పట్టణ అధ్యక్షులు ప్రశాంత్ ఇస్తేకర్ తదితరులు పాల్గొన్నారు



# సోనాల మండలానికి నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శిని సన్మానించి స్వాగతం పలికిన సోనాల ఎంపీడీఓ .

**సోనాల 03 జూన్ (డీడీ 9 వార్త న్యూస్ ):**

బుధవారం రోజు సోనాల మండలానికి నూతనంగా విచ్చేసిన పంచాయితీ కార్యదర్శి షేక్.అజ్మత్ ను శాలువాతో సన్మానించి స్వాగతం పలికిన సోనాల ఎంపీడీవో N. మహేందర్ కుమార్. సోనాల మండలం వజ్జర్ గ్రామ పంచాయతీకి నూతనంగా షేక్.అజ్మత్ పంచాయతీ కార్యదర్శి గా బాధ్యతలు స్వీకరించారు. షేక్.అజ్మత్ సిరికొండ మండలం పొన్న గ్రామానికి తన సేవలను అందించి మంచి మన్నలను పొందారు. నేడు సోనాల మండలం వజ్జర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా గ్రామాభివృద్ధిలో మీ సేవలు అమూల్యమైనవని ఎంపీడీవో N. మహేందర్ కుమార్ అన్నారు. ఈ సందర్భంలో సోనాల మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు అందరూ మరియు ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నేరాల నివారణలో సీసీ కెమెరాలే కీలకం : నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్

**నిజామాబాద్ జిల్లా, జూన్ 03(డీడీ9 వార్త) :**

ప్రజలకు భద్రతాభావం కల్పించడం,నేరాలను సమర్థవంతంగా అరికట్టడమే లక్ష్యంగా నిజామాబాద్ పోలీసులు బుధవారం ఇస్లాంపుర, ఖోజా కాలనీ ప్రాంతాల్లో 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం' నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్ పర్యవేక్షణలో టౌన్1 ఎస్.హెచ్.ఓ రఘుపతి నేతృత్వంలో సుమారు 70 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని కాలనీలోని ఇళ్లలో విస్తృతంగా సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను, రెండు ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రకాష్ మాట్లాడుతూ.. అసాంఘిక శక్తులు, నేరస్తులు కాలనీల్లో తలదాచుకోకుండా ఉండేందుకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని తెలిపారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని, కాలనీవాసులందరూ భాగస్వాములై ప్రతి వీధిలోనూ వీటిని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సీసీ కెమెరాలు 24 గంటల నిరంతర నిఘాగా ఉండి నేరస్తులను గుర్తించడంలో పోలీసులకు ఎంతో సహకరిస్తాయని ఆయన వివరించారు. ఇళ్లను అద్దెకు ఇచ్చేవారు కొత్త వ్యక్తుల పూర్తి వివరాలను సేకరించడమే కాకుండా, వారి ఆధార్ కార్డులను తప్పనిసరిగా తీసుకోవాలని ఏసీపీ సూచించారు. కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే డయల్ 100కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని టౌన్ 1 ఎస్.హెచ్.ఓ రఘుపతి స్పష్టం చేశారు.



# కేసీఆర్ కాలనీలో తీరిన నీటి కష్టాలు

**నిజామాబాద్ జిల్లా, జూన్ 03(డీడీ9 వార్త) :**

కమ్మర్ పల్లి మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీలో గత కొద్ది రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న కాలనీవాసులకు సర్పంచ్ కొత్తపల్లి హారిక, ఉపసర్పంచ్ కొత్తపల్లి అశోక్ ఊరటనిచ్చారు. కాలనీలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని తెలుసుకున్న వెంటనే వారు స్పందించి, నూతనంగా బోరు వేయించి, 1.5 హెచ్‌పీ మోటారును బిగించి కాలనీవాసులకు నీటిని అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... కాలనీలో నీటి సమస్య ఉందని తెలియగానే పాలకవర్గంతో చర్చించి, తక్షణమే బోరు వేయించి మోటారు బిగించడం జరిగిందని తెలిపారు. గ్రామంలో ఎక్కడైనా ఇటువంటి సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వినోద్ కుమార్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# నేరడిగొండ ZPHS పాఠశాలలో గ్రామ సభ, ర్యాలీ, బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

**అదిలాబాద్ జిల్లా నేర డిగొండ జూన్ 3డిడి 9వార్త,,**

నేరడిగొండ మండల కేంద్రంలోని ZPHS పాఠశాలలో గ్రామ సభ, ర్యాలీ, బడిబాట కార్యక్ర మం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని, అనుభవమున్న ఉపాధ్యాయులతో విద్యాబోధన నేర్పిస్తున్నామని అన్నారు. నేరడిగొండ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే గారి కృషి వలన వచ్చే సంవత్సరం నుండి పబ్లిక్ స్కూల్ గా మారబోతుందని, నర్సరీ నుండి 12వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంగా ఆధునికరిచడం జరుగుతుందని అన్నారు. కావున మండల ప్రజలు ప్రైవేట్ పాఠశాలలో కాకుండా సకల సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి,ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్, వార్డు సభ్యులు సాబ్లే సంతోష్ సింగ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గంగామణి, ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# పిల్లలు, గర్భవతుల కోసం బరువు కొలిచే యంత్రం వితరణ

**నిజామాబాద్ జిల్లా, జూన్ 03(డీడీ9 వార్త) :**




కమ్మర్ పల్లి మండలంలోని చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్పల్లి ఆధ్వర్యంలో బుధవారం బరువు కొలిచే యంత్రాన్ని అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే చిన్న పిల్లలు, గర్భవతుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించేందుకు, వారి బరువును ఖచ్చితంగా నమోదు చేసేందుకు ఈ యంత్రం ఎంతో ఉపయోగపడుతుందని లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతోనే ఈ చిన్నపాటి సహాయం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లుక్క గంగాధర్, కోశాధికారి తెడ్డు రమేష్, చౌట్‌పల్లి సర్పంచ్ మహబూబ్, ఉప సర్పంచ్ విశాల్, లయన్స్ క్లబ్ సభ్యులు నోముల నరేందర్, బద్దం రాజశేఖర్, గుండోజీ రవీందర్, చిలివేరి పవన్ కుమార్, సురంగి చంద్రశేఖర్, సూర నరసయ్య, హెల్త్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది చింత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




# ఓ ఊరి రాతనే మార్చిన అన్నదమ్ముల గొడవ

'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాతో నిర్మాతగా తొలి ప్రయత్నంలోనే విజయాన్ని అందుకున్నారు దర్శకుడు వేణు ఊడుగుల. ఇప్పుడాయన నిర్మాణంలో మరో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. మధుకర్ రెడ్డి కోమిరెడ్డి దర్శకత్వంలో ఓ సినిమా నిర్మించనున్నారు. సంధ్య భాను చల్లా మరో నిర్మాత. ఈ చిత్రాన్ని వేణు ఊడుగుల మంగళవారం ప్రకటించారు. ''ఇది వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న సినిమా. ఇద్దరు అన్నదమ్ముల గొడవ తెలంగాణలోని జమ్మికుంట అనే ఊరి రాతనే ఎలా మార్చింది? వారిలో ఎవరు గెల్చినా ఊరు మాత్రం ఎందుకు ఓడిపోయింది? రామాయణంలో రామలక్ష్మణుల్లా కలిసి ఉండాల్సిన అన్నదమ్ములు మహాభారతంలో సోదరుల్లా గొడ్డళ్లు ఎందుకు పట్టుకున్నారు? అన్నదే ఈ చిత్ర ఇతివృత్తం'' అని తెలియజేశారు. ప్రస్తుతం ఈ సినిమా కోసం నటీనటుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది.

# వెంకీ కోసం మరో స్క్రిప్ట్!

కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం 47'ను పూర్తి చేసే పనిలో ఉన్నారు. మరోవైపు అనిల్ రావిపూడి దర్శకత్వంలో కల్యాణ్‌రామ్‌తో కలిసి చేయనున్న మల్టీస్టారర్ సినిమాకి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇది జులై లేదా ఆగస్టులో పట్టాలెక్కనున్నట్లు తెలుస్తోంది. అయితే ఇవింకా పూర్తి కాకముందే తన తదుపరి చిత్రానికి సంబంధించి ఆసక్తికర చర్చ జరుగుతోంది. వెంకీ కోసం 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఓ కథని సిద్ధం చేసే పనిలో ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే దీనిపై నిర్మాత సురేశ్‌బాబుతో ఓ దశ చర్చలు జరిగినట్లు సమాచారం. పూర్తి స్క్రిప్ట్ సిద్ధమయ్యాక వెంకటేశ్‌కి వినిపించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాతే దీనిపై తుది నిర్ణయం వెలువడే అవకాశముంది. ఇక ప్రస్తుతం చిరంజీవితో వశిష్ఠ తెరకెక్కించిన 'విశ్వంభర' నిర్మాణానంతర పనుల్లో ఉంది. ఇది ఈ ఏడాదే తెరపైకి వచ్చే అవకాశముంది.



# నా భవిష్యత్తు పాడు కాకుండా అది నాకు ఎంతగానో సహాయపడింది


బాలీవుడ్ యంగ్ హీరోయిన్ రియా చక్రవర్తి సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణం తర్వాత జీవితంలో ఎన్నో కష్టాలను, అవమానాలను ఎదుర్కొంది. ఆ సమయంలో సోషల్ మీడియాలో ఆమెపై తీవ్రస్థాయిలో ట్రోలింగ్, విమర్శలు వచ్చాయి. అంతటి బాధను అనుభవించినప్పటికీ, ఆమె జీవితంపై నమ్మకాన్ని కోల్పోలేదు. మళ్లీ ఇండస్ట్రీకి రీఎంట్రీ ఇచ్చి ప్రేక్షకులను అలరిస్తోంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో, గత కొన్ని సంవత్సరాలుగా ఆ బాధాకరమైన గతం నుండి బయటపడి తన జీవితాన్ని ఎలా చక్కదిద్దుకుందో రియా పంచుకుంది. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ కేసు తన వ్యక్తిత్వాన్ని పూర్తిగా ఎలా మార్చేసిందో వివరించింది. "ఆ సంఘటన తర్వాత నేను చాలా మారిపోయాను. ఇప్పుడు నాకు లోకజ్ఞానం బాగా తెలిసింది. నా స్నేహితులు నన్ను చూసి.. 33 ఏళ్ల బాడీలో ఉన్న 80 ఏళ్ల ముసలావిడ అని జోకులు వేస్తుంటారు.

ఎందుకంటే నేను జీవితంలో చాలా చూశాను. మనం అనుభవించిన చేదు జ్ఞాపకాలను అంత తేలికగా మర్చిపోలేం, అవి మనల్ని పూర్తిగా మార్చేస్తాయి" అని ఆమె అన్నారు. ఆ బాధల నుండి ఎలా కోలుకుందో చెబుతూ.. "నేను గత నాలుగేళ్లుగా థెరపీ తీసుకుంటున్నాను. నేను ఎలాంటి వ్యక్తినో తెలుసుకోవడానికి, నా పాత బాధలు నా భవిష్యత్తును పాడు చేయకుండా చూసుకోవడానికి ఈ థెరపీ నాకు ఎంతగానో సహాయపడింది. నేను ఇంకా మంచిగా ఉండాలనే అనుకుంటున్నాను. ప్రేమపై నాకు ఇంకా నమ్మకం ఉంది. నేను అందరిలాగే చాలా నార్మల్‌గా బతకాలని అనుకుంటున్నాను. ఈ ప్రపంచంలో కేవలం నాకే కష్టాలు వచ్చాయని నేను అనుకోవడం లేదు. నేను కూడా మిగతా 30 ఏళ్ల అమ్మాయిల్లాగే ప్రశాంతంగా జీవిస్తూ, డబ్బు సంపాదిస్తూ, లైఫ్‌లో ఏదైనా సాధించాలని అనుకుంటున్నాను" అంటూ రియా చక్రవర్తి ఎమోషనల్ అయింది.



# 'పెద్ది' టికెట్ల రేట్ల పెంపునకు తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్.. వారికి థాంక్యూ చెబుతూ రామ్ చరణ్ ట్వీట్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కిన 'పెద్ది' చిత్రం జూన్ 4న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. ఇప్పటికే ఈ సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చెయ్యగా.. తాజాగా తెలంగాణ ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో సాధారణ టికెట్ ధరపై అదనంగా రూ. 100, మల్టీ ప్లెక్స్ థియేటర్లలో ప్రతి టికెట్ ధరపై అదనంగా రూ. 125 పెంచుకోవచ్చునని అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఈ సినిమాకు సంబంధించి జూన్ 3న రాత్రి ప్రదర్శించే ప్రత్యేక ప్రీమియర్ షోల టికెట్ ధరను రూ. 600 వరకు పెంచుకునేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక టికెట్ ధరల పెంపు సినిమా విడుదలైన రోజు నుంచి గరిష్ఠంగా 10 రోజుల వరకు వర్తిస్తుందని జీవోలో పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం టికెట్ల రెట్లు పెంపునుకు అనుమతి ఇవ్వడంతో 'పెద్ది' టీమ్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ వేదికగా.. 'తెలుగు సినిమా శ్రేయస్సు కోసం మీ మద్దతు అండ్ నిరంతర ప్రోత్సాహాన్ని అందించిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు, గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారు, గౌరవ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమట రెడ్డి KVR గారు అండ్ తెలంగాణ ప్రభుత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.



# రణ్‌వీర్‌పై 'నిషేధం' ఎత్తివేత.. 'ఎఫ్‌డబ్ల్యూఐసీఈ' అధికారిక ప్రకటన

కొన్ని రోజులుగా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన రణ్‌వీర్ సింగ్ 'డాన్ 3' అంశం ఓ కొలిక్కి రానుంది. ఆయనపై (Ranveer Singh) విధించిన నాన్ కోఆపరేషన్ ఆదేశాలను ఉపసంహరించుకుంటున్నట్లు 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' బుధవారం వెల్లడించింది. ఈ మేరకు సంస్థ (FWICE) అధ్యక్షుడు బీఎన్ తివారీ ఓ ప్రకటనను విడుదల చేశారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. రణ్‌వీర్ 'ఎఫ్‌డబ్ల్యూఐసీఈ'కి లీగల్ నోటీసులు పంపిన అనంతరం ప్రెస్‌మీట్ నిర్వహించిన సంస్థ నిషేధాన్ని తొలగిస్తున్నట్లు తెలిపింది.

ఎఫ్‌డబ్ల్యూఐసీఈ (FWICE) చీఫ్ అడ్వైజర్, ఫిల్మ్‌మేకర్ అశోక్ పండిట్ ఈ విషయం గురించి మాట్లాడుతూ.. నిషేధాన్ని ఉపసంహరించుకోవాలని రణ్‌వీర్ కోరినట్లు తెలిపారు. ఈ అంశంపై చిత్రబృందంతో చర్చలు జరిపి పరిష్కరించుకోవాలని తాము రణ్‌వీర్‌కు విజ్ఞప్తి చేసినట్లు అశోక్ చెప్పారు. ఇండస్ట్రీలో ఎవరిపైనా నిషేధం విధించే హక్కు తమకు లేదని స్పష్టం చేశారు. దీనిపై రణ్‌వీర్ నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.



# రజనీ 173... పనులు చకచకా

కథానాయకుడు రజనీకాంత్ ఇప్పటికే 'జైలర్ 2'ని ముగించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమాని సెప్టెంబరులో తెరపైకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక మరోవైపు రజనీ 173వ సినిమా పూర్వ నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. దీన్ని కమల్‌హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంర్నేషనల్‌పై నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. దీన్ని యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఆయన ఇటీవలే పూర్తి స్క్రిప్ట్‌ని రజనీకి వినిపించగా.. సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈక్రమంలోనే ప్రస్తుతం ఈ సినిమా కోసం చెన్నైలోని పూనమల్లి ప్రాంతంలో ఓ భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు సమాచారం. ఈ పనులు పూర్తి కాగానే చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశముంది.



# విజయ్ ఆంటోని వంద దేవళ్ళు రిలీజ్ డేట్ ఫిక్స్..

'బిచ్చగాడు' సినిమా ఎలాంటి సక్సెస్ అందుకుందో అందరికి తెలిసిందే. విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కలయికలో వచ్చిన ఈ మూవీ సూపర్ డూపర్ హిట్ టాక్ తెచ్చుకున్ని ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంది. ఇప్పుడు ఇదే కాంబో 'వంద దేవుళ్ళు' చిత్రంతో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. విజయ్ ఆంటోని హీరోగా, డైరెక్టర్ శశి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో స్వాసిక అజయ్, కావ్య, శక్తి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రామాజనేయులు జవ్వాని నిర్మతగా వ్యవహరిస్తున్నాడు. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన టీజర్, ఫస్ట్ సింగిల్‌తో పాటు సాంగ్స్ కూడా చాట్ బాస్టర్ హిట్ అందుకున్నాయి. దీంతో సినిమాపై ప్రేక్షకుల్లో ఎక్స్‌పెక్టేషన్స్ పెరిగాయి. ఈ క్రమంలోనే తాజాగా మరో అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు సినిమా తెలుగుతో పాటు తమిళంలో జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు ప్రకటిస్తూ ఓ సరికొత్త పోస్టర్‌ను షేర్ చేశారు. ఈ పోస్టర్‌లో విజయ్ ఆంటోని, స్వాసిక అజయ్ సైకిల్ మీద వెళ్తు కనిపించి ఆకట్టుకుంటున్నారు.




# రొమాంటిక్ థ్రిల్లర్‌తో రాబోతున్న కీర్తి సురేష్..

టాలీవుడ్ యంగ్ హీరోయిన్, నేషనల్ అవార్డ్ విన్నర్ కీర్తి సురేష్ గత ఏడాది 'రివాల్వర్ రీటా'తో ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ పెద్దగా మెప్పించలేకపోయింది. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్స్ అనౌన్స్ చేస్తూ ఫుల్ బిజీ బిజీగా గడుపుతోంది. తెలుగులో విజయ్ దేవరకొండ సరసన 'రౌడీ జనార్ధన' చేస్తుండగా.. రాజ్‌కుమార్ రావు సరసన 'రఫ్తార్' చిత్రంలో ప్రధాన పాత్రలో కనిపించనుంది. ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అనురాగ్ ఠాకూర్, రోహన్ వర్మ, తాన్యా మణిక్తాలా, రజత్ కపూర్ కీలక పాత్రల్లో నటించారు. ఇది దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 16, 2026న థియేటర్లలో విడుదల కానుంది.

మరోవైపు.. ప్రవీణ్ ఎస్ విజయ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సత్యవాన్ సావిత్రి' అనే కోర్టు రూమ్ లీగల్ డ్రామా ప్రాజెక్ట్‌ను కూడా కీర్తి ఇటీవల ప్రకటించింది. మలయాళంలో ఆంటోనీ వర్గీస్ పెపేతో కలిసి 'తోట్టం' అనే చిత్రంలోనూ ఆమె నటిస్తోంది. ఇవే కాకుండా, టాలీవుడ్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కలిసి చేయబోయే మల్టీస్టారర్ చిత్రంలో కూడా కీర్తి సురేష్ ఒక హీరోయిన్‌గా నటించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలు ఇంకా విడుదల కాకముందే.. కీర్తి సురేష్ మరో కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ కొత్త మూవీ ఒక వినూత్నమైన రొమాంటిక్ థ్రిల్లర్ కథాంశంతో రాబోతున్నట్లు సమాచారం. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, కీర్తి సురేష్ లైనప్ చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500081. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.